ప్రజాశక్తి
బుధవారం 2 జులై 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆయాశాఖల అధికారులను హెచ్చరించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పిజిఆర్ఎస్ అర్జీల ఫీడ్ బ్యాక్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పనులు, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, పింఛన్ల పంపిణీ మొదలైన అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, ఆయాశాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అశ్రద్ధగా వుంటే కఠిన చర్యలు వెనకాడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, హౌసింగ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, నాగరాజకుమారి, జడ్పీ డిప్యూటీ సిఈవో మోహనరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, సిపివో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఏడాది పాలనపై ప్రజల్లో సర్వే

టిడిపి ప్రభుత్వం ఏడాది పాలన ఎలా ఉందనే విషయమై ఆపార్టీ అధిష్టానం నేటి నుంచి " ఏడాది సుపరిపాలన- ఇంటింటికి తెలుగుదేశం " కార్యక్రమం నిర్వహిస్తుంది. జిల్లా వ్యాపితంగా 8 నియోజకవర్గాల్లో ప్రతి బూత్ స్థాయిలో నిర్వహించడానికి ఆపార్టీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతి రోజు 50 కుటుంబాలకు తక్కువ కాకుండా యాప్ ద్వార సర్వే నిర్వహించాలని ఆపార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఎంఎల్ఎలు ప్రతి రోజూ ఒకటో, రెండో గ్రామాల్లో పర్యంటించనున్నారు. మంత్రులు, ఎంపి, ఎంఎల్‌సిలు వారి అవకాశాన్ని బట్టి పాల్గొననున్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంపై తెలుగు తమ్ముళ్లు కొందరు కొందలు అలకపాన్పు ఎక్కారు. వీరిని బుజ్జగించి పార్టీ కార్యాక్రమం చేయాలని చూస్తున్నారు. కొందరు మాకెందులే అన్నట్లు మాట్లాడుతున్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను తీసుకోనున్నారు.

- ప్రతి బూత్ స్థాయిలో 50 కుటుంబాలతో భేటి
- ప్రత్యేక యాప్ తయారీ
- తమ్ముళ్ల అలక తీర్చేనా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల అభిప్రాయం తీసుకోడానికి నేటి నుంచి ఆపార్టీ నేతలు ఇంటింటికి వెళ్లనున్నారు. జిల్లా వ్యాపితంగా టిడిపి బూత్ కమిటీల ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక్కో నియోజకవర్గంలో 250 నుంచి 350 బూత్ కమిటీలున్నాయి. గత ఎన్నికల సమయంలో మొత్తం డేటా ను పార్టీ నేతలు సేకరించారు. ప్రతి ప్రాంతంలో వ్యక్తులు, కుటుంబాలు, వారి వివరాలు అంతా సిద్ధంగా ఉన్నాయి. ఏడాది ప్రభుత్వ పాలన పూర్తి చేసుకుంది. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించామని భావిస్తోంది. తల్లికి వందనం పథకం, స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు అమలు చేస్తున్నారు.ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, ఇస్తామని చెబుతున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేదా నెలకి రూ. 3 వేలు నిరుద్యోగ భృతి.. ప్రతి మహిళకూ నెలకి రూ.1500 అమలు కాలేదు. పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోని బిజెపి, టిడిపి, జనసేన నాయకుల మధ్య సమన్వయం అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వం ఇన్ని హామీలు పూర్తిగా అమలు చేయలేదు. ప్రజలు ప్రభుత్వ పాలన పట్ల ఎలా ఉన్నారనే విష యమై అభిప్రాయం తీసు కోడానికి ప్రత్యేక యాప్ తయారు చేశారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ 50 కుటుంబాలకు తక్కువ కాకుండా సర్వే నిర్వ హించారు. ఎక్కువ సమయం ప్రతి ఇంటి వద్ద ఉండి, వారు ఏం చెబుతున్నారు. అనే విషయాన్ని రికార్డు చేయనున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన పనికి సంబంధించి కాకుండా ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారో రికార్డు చేయను న్నారు. ప్రతి ఎంఎల్ఎ రోజు ఒకటి, రెండు గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మంత్రులు, ఎంపి, ఎంఎల్‌సిలు వారి వెసులుబాటు చూసుకొని పాల్గొననున్నారు. ఇక్కడ నుంచి వచ్చే సమాచారం ప్రకారం తమ పాలనలో ఏం మార్పు చేయాలో చూస్తున్నారు. అందుకోసం ఆపార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తమ్ముళ్ల అలక తీర్చారా..!

కూటమి ప్రభుత్వం అధి కా ర ం లో కి వచ్చి ఏడాది ముగిసింది. ఆపార్టీ నేతలు, కార్యకర్తల్లో అలసట కనిపిస్తోంది. మాకు ఏం చేశారని, ఏం ఇంటింటికి వెళ్లాలి అంటూ పెదవి విరుస్తు న్నారు. ఎంఎల్ఎలు వారితో ఉన్న వ్యక్తులే చేసుకుంటారే అంటూ చెబుతున్నారు. ఏడాది పాలనలోపార్టీ కోసం కష్టపడి పనిచేసినా మాకు అన్యాయం జరిగిందని కొందరు నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి నెల రోజుల పాటు జరిగే ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ఎలా సాగుతుందోననే అనుమానం ఉంది. ఇది పూర్తిగా పార్టీ కార్యక్రమం కావడంతో సచివాలయ సిబ్బంది,. ఇతర ప్రభుత్వం ఉద్యోగులు ఎవ్వరూ ఇందులో జోక్యం చేసుకోకూడదు. ఇక్కడ నుంచి అభిప్రాయాల మేరకే ఎంఎల్ఎల పనితీరును లెక్కకట్టనున్నారు.



చిల్డ్రన్స్ పార్కులో పరిశీలన

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్

నగరంలోని 17 వ డివిజన్ చిల్డ్రన్స్ పార్కులో మంత్రి నారాయణ కమిషనర్ నందన్ తదితరులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పార్కులో సమస్యలపై మంత్రికి కమిటీ సభ్యులు వివరించారు.పార్కు అభివద్ధికి చేపట్టాల్సిన పనులపై కమీషనర్ నందన్ కు మంత్రి పలు సూచనలు ఇచ్చారు. స్కేటింగ్ ట్రాక్ ని ఆధునీకరిస్తానని హామీ ఇచ్చారు.పార్కు ఆధునీకరణ బాధ్యతను కన్సల్టెన్స్ కి అప్ప చెబుతామని కన్సల్టెన్సీ ,పార్కు కమిటీ ,కార్పొరేషన్ అధికారుల ఏకాభిప్రాయం తో పనులు ప్రారంభిస్తామని మంత్రి అన్నారు. పార్క్ అభివద్ధికి కొంత నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చిన రియల్టర్ వెంకటేస్వర్లును అభినందించారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 17/3 ఆకుతోట సచివాలయం, 42 వార్డు మన్సూర్ నగర్ ప్రాంతాలలో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాల నిర్వహణను తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న పాయింట్లను గుర్తించి వాటిని శుభ్రం చేసి ఆయా బ్లాక్‌స్పాట్‌లను తొలగించారు. డివిజన్ల పరిధిలోని డ్రెన్ కాలువలలో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు.

నేడు వామపక్ష నేతలు రాక

కరేడులో పోలీసుల నిఘా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కరేడుకు నేడు వామపక్ష పార్టీల నేతలు రానున్నారు. సోలార్ ఫ్యానల్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించారు. కరేడులో వాస్తవ పరిస్థితులు తెలుసుకొని, గ్రామం పరిధిలోని రైతులు, ప్రజలను కలుసుకోడానికి, వారికి మద్దతు తెలపడానికి విజయవాడ నుంచి వామపక్ష పార్టీల నేతలు వస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు కెవివి ప్రసాద్, సిపిఎం(ఎంఎల్) న్యూ డెమక్రసీ నాయకులు వెంకటేశ్వరు, ఆర్ఎస్‌పి నాయకులు జానకిరామయ్యతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, మరికొందరు ముఖ్యనాయకులు రాను న్నారు. నేడు ఉదయం 10 గంటలకు భూసేకరణ జరిగే ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలను కలుసుకోనున్నారు. ఇటీవల జరిగిన ప్రజా ఉద్యమంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వామపక్ష నేతలు రానున్న నేపథ్యంలో పోలీసులు నిఘా పెట్టారు. ఎస్‌బి, ఇంటల్‌జెన్ అధికారుల ఆరా తీస్తున్నారు. ఇప్పటికే 39 మందిపై నాన్‌బెయిల్ బుల్ కేసులు నమోదు చేశారు. ఇందులో 25 మంది రైతులు, 13 మంది ఉద్యమ కారులున్నారు. ఈనెల 4న ప్రజాబిప్రాయ సేకరణ జరపనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి నిరసన జ్వాలలు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.



కరేడు రైతులు ఆందోళన చేస్తున్న దృశ్యం(ఫైల్)

రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు : ఉలవపాడు మండలం, కరేడులో ఇండోసోల్ కంపెనీకి 8338 ఎకరాలు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెనక్కు తీసుకోవాలని రోడ్డెక్కిన రైతన్నలు, రాజకీయ పార్టీల నాయకులపై పోలీసులు బనాయించిన నానె బెయిలబుల్ కేసులను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025 జూన్ 29 ఆదివారం తమ భూములను ప్రయివేటు పరిశ్రమకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుని తీరుతామని రైతులు పెద్ద ఎత్తున రోడ్డుమీదకు వచ్చారన్నారు. ఆ పోరాటానికి వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు మద్దతు ఇచ్చాయని, పచ్చని పంట పొలాలను సోలార్ ప్రాజెక్టుకు అప్పగిస్తే తమగతి ఏమిటని ప్రశ్నించిన పాపానికి రైతులపై, నాయకులపై కేసులు బనాయించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ల నుంచి బలవంతంగా తీసుకున్న 8338 ఎకరాల భూములను తక్షణమే వారికి అప్పగించాలన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్య కారణంగా కరేడు ప్రధాన గ్రామంతో పాటు రామకష్ణాపురం, ఉప్పరపాలెం, పెద్దపల్లిపాలెం, పాతపల్లె పాలెం, అలగాయపాలెం, కొత్తరెడ్డి పాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయ భూమితో పాటు 300 గృహాలు కంపెనీ పరమౌతాయన్నారు. ప్రజలను పరిశ్రమల పేరుతో బలవంతంగా బయటకు పంపిస్తే ఊరుకొనేదిలేదన్నారు.

పింఛన్లు పంపిణీ

నెల్లూరు కార్పొరేషన్ : ఒకటో తేదీన రాష్ట్రంలో పింఛన్ల పండుగరోజు అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని 42వ డివిజన్ మన్సూర్ నగర్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నగర కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో..

నెల్లూరు : పొదలకూరురోడ్డులో గల గౌతమి నగర్ రెండో వీధిలో మానసిక దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ ను అందించారు. మంగళవారం ఉదయం లబ్ధిదారురాలు భాను శ్రీ ఇంటికి వెళ్ళిన కలెక్టర్ రూ. 15 వేలు పింఛను అందించారు.

లింగసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి క్రమం తప్పకుండా ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం అన్నారు. మంగళవారం ఆయన లింగసముద్రం పంచాయతీలో స్వయంగా వద్దులకు పెన్షన్ అందజేశారు. లింగసముద్రం గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు గాలంకి ప్రసాదు ఉన్నారు.

కందుకూరు : సంక్షోభంలోను ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరిగ్గా లేకపోయినా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీన కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కందుకూరు పట్టణంలోని 25 వ వార్డు కేసరగుంట కాలనీలో లబ్ధిదారులకు ఇంటివద్దనే ఎంఎల్‌శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు పింఛన్లు పార్టీ నాయకులు , అధికారులుతో కలిసి పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కే అనూష పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు సురేష్ కుమార్, కందుకూరు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ముచ్చు శ్రీనివాసరావు ఉన్నారు.

అనుమతుల మేరకు నిర్మాణాలు

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న నూతన భవన నిర్మాణాలు పట్టణ ప్రణాళిక విభాగం అనుమతించిన మేరకే జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కమిషనర్ మంగళవారం చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు పరిసర ప్రాంతాలలో పర్యటించారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు : గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఎఒకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు కొపెంచల నరసయ్య, జిల్లా కార్యదర్శి గడ్డం నాగేశ్వరరావు మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు రాష్ట్రమంతా ఒకే జీతం అందడం లేదన్నారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈనె 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో పంచాయతీ కార్మికు లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వేణు, రమణయ్య, బాబు పాల్గొన్నారు.



కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే..!

ఆటో కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ - ఘనంగా జిల్లా 6వ మహాసభ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆటో కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజ్ ఫర్ అహ్మద్ అన్నారు. నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రం లోని అంబేద్కర్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభలలో ముందుగా సిఐటియు జెండాను ఆటో కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజ్ ఫర్ అహ్మద్ ఆవిష్కరించి మహాసభలు ప్రారంభించారు.తొలుత ఆర్‌టిసి బస్టాండ్ నుంచి అంబేద్కర్ భవనం వరకు 500 ఆటోలతో ఆటో ర్యాలీ నిర్వహించారు. మహాసభలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలనలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం వాహన మిత్ర పథకం ద్వారా రూ.15వేలు ఇస్తానన్నటువంటి వాగ్దానం ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఆటో ట్రాన్స్పోర్ట్ కార్మికులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 21 ప్రకారం ఆర్‌టిఎ ఆఫీసులో వాహనాలు అందించే అన్ని రకాల సేవలపై 100శాతం ఫీజులు పెంచి కార్మికుల నడ్డి విరుస్తుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆటో కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలను బుచ్చిరెడ్డిపాలెంలో జరపడం చాలా సంతోషదా యకమన్నారు.కార్మికులు భవిష్యత్తులో ఎదుర్కొనేట టువంటి అన్ని రకాల ప్రజా వ్యతిరేక పోరాటాలకు ముందుండాలని పిలుపిచ్చారు. అంతేకాకుండా జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో ఆటో కార్మికులు టైర్ బంద్ చేసి పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంఘటితంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులపై విధిస్తున్న పోలీసు ఈ చలానాలు, ఫైన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా నుండినలుమూలల నుండి ఆటో కార్మికులు 300 మంది ప్రతినిధులు పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేశారు. ఈ మహా సభలు జయప్రదం చేసిన బుచ్చి మండల సిపిఎం, సిఐటియుకు ఆటో కార్మి కులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బుచ్చిరెడ్డిపాలెం సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ మల్లికార్జున, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గురునాథం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ ఉన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

ఈ మహాసభ అనంతరం 27 మందితో జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా కె.సురేష్, మారుబోయిన రాజా ట్రెజరర్‌గా బాబురావు మహాసభ ఏకగ్రీవంగా ఎన్ను కుంది. 11 మంది ఆఫీస్ బ్యారర్స్, 13 మంది జిల్లా కమిటీ సభ్యులతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ జిల్లా కమిటీకి గౌర వాధ్యక్షులుగా టివివి ప్రసాద్ ను ఎన్నుకున్నారు.



ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె సురేష్, మారుబోయిన రాజా

వైద్యులకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని వాసవి క్లబ్ లెజెండ్స్, వనిత క్లబ్ ల ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా కందుకూరు కోవూరు రోడ్డు లోని హరిణి ప్రజా వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జున ని సన్మానించి మొక్కని అందజేశారు.ఈ ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ మొట్టమొదటి డాక్టర్ బీసీ రాయ్ జయంతి సందర్భంగా ఆయన గుర్తుగా డాక్టర్స్ డే ని జరుపుకుంటున్నామని అన్నారు. కరోనా సమయములో తమ ప్రాణాలకు తెగించి ఎంతోమంది ప్రజలను కాపాడిన డాక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో సేవలు అందిస్తున్న వాసవి క్లబ్స్ వారిని డాక్టర్లు అభినందించారు. వాసవి క్లబ్ లెజెండ్స్ సెక్రటరీ గాధం శెట్టి మణికుమార్, ట్రెజరరీ కొణిజేటి విజయ్ కుమార్,వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ నారాయణ సుకన్య, ట్రెజరరీ తటవర్తి బీబీ జానమ్మ,జెడ్. సి. కొత్తూరి నటరాజకుమారి, ఆర్.సి. కోట వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు ఉన్నారు.



కందుకూరును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం..

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణ అభివద్ధిలో భాగంగా రూ.1.25 కోట్ల వ్యయంతో ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి పామూరు రోడ్డు సర్కిల్ వరకు రెండు వైపులా రహదారి విస్తరణ , సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కందుకూరు మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదష్టితో, మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సహకారంతో పట్టణ అభివద్ధి తన శక్తివంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ యబ అనూష, మున్సిపల్ డి ఈ గణపతి పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, మధిర మధు, వడ్లమూడి చెంచు నారాయణ ఉన్నారు.



శంఖుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

పాలసీదారుల ప్రయోజనాలే ముఖ్యం

ప్రజాశక్తి-కందుకూరు

జీవిత బీమా పాలసీదారుల ప్రయోజనాలే ముఖ్యమని ఎఐఐఈఎ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.కందుకూరు జీవిత బీమా కార్యాలయంలో మంగళవారం ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారోత్సవాల కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా యూనియన్ జండాను ఆవిష్కరించారు. యూనియన్ స్థాపించి 74 సంవత్సరాలు పూర్తి చేసుకుని 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. ఐసీఈయూ అధ్యక్షులు షేక్ షబ్బీర్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఎల్ఐసి ఆవిర్భావంలో ఎదుగుదలలో యూనియన్ పాత్రను వివరించారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరపడానికి నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు, డ్రాయింగ్ కాంపిటేషన్, మానసిక వికలాంగ పిల్లల పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచడం, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు చీఫ్ మేనేజర్ జనార్ధన్ , బ్రాంచి కార్యదర్శి పి విష్ణువర్ధన్ రెడ్డి, యూనియన్ సభ్యులు, క్లాస్ వన్ అధికారులు, డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.



పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ పరిధిలోని ఆనందపురంలో మంగళవారం మోపాడు ఆయకట్టు పరిధిలోని పల్లెవాగు లో పూడికతీత కార్యక్రమంలో భాగంగా భూమి పూజ కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మోపాడు చెరువు ఆయకట్టు పొలాలకు చెరువు నుంచి కాలువల ద్వారా పొలాలు నీరు చేరేందుకు కాలువల్లో పూడిక తీసి, రైతుల పంట పొలాలకు నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం కషి చేస్తుందని ఎంఎల్ఎ తెలిపారు. మోపాడు, మాచవరం ఆయకట్టు పరిధిలోని 7 పంట కాలువల్లో పూడిక తీయడం కోసం 43 లక్షలు రూపాయల నిధులను కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుందని ఆయన తెలియజేశారు.కూటమి ప్రభుత్వంలో రైతుల పంటకు పెట్టుబడి సాయం కింద త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20,000 రూపాయలు అందించినట్లు ఎమ్మెల్యేగా తెలిపారు. ఎంఎల్ఎ నాగేశ్వరరావు స్వయంగా జెసిబితో పనులు మొదలుపెట్టారు.కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, కందుకూరు పట్టణ టిడిపి అద్యక్షుడు దామా మలేశ్వరరావు,వి ఆర్ కోట సప్లై ఛానల్ అధ్యక్షుడు తల్లపనేని రవీంద్రబాబు, కంద్రా మాల్యాద్రి, పార్టీ నాయకులు గుడవరపు నరసిహరావు,తల్లపనేని మురళి, దామా మాధవరావు, రావుల నారాయణ, వడ్డెళ్ళ వెంకట్రావు ,మందలపు కోటేశ్వరరావు, మాదాల రవి ,తోకల మాల్యాద్రి, రావుల రవి, సూర్య వినోద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..



కార్మికుల వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగపు కార్మికుల జీతాలు వెంటనే పెంచాలని,పభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టిన ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో కార్పోరేషన్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష,కార్యదర్శులు ముని మోహన్ బాబు, మట్టిపాటి శ్రీనివాసులు ప్రసంగించారు. నగరపాలక సంస్థలో మంచినీటి సరఫరా,వీధిలైట్లు డ్రైనేజీ తదితర సౌకర్యాల కల్పనలో కీలక పాత్ర వహిస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులు అత్యంత తక్కువ జీతాలు తీసుకుంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన వేతన సవరణ కమిషన్ కనీస వేతనం 26 వేల రూపాయలకు తక్కువ లేకుండా ఉండాలని నిర్ణయిస్తే నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికుల జీతం కేవలం 13 వేల రూపాయలు మాత్రమే ఉండడం బాధాకరమ న్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఇంజనీరింగ్ విభాగం కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచల నరసయ్య, సిఐటియు నగర నాయకులు పి సూర్యనారాయణ,ఇంజనీరింగ్ విభాగం యూనియన్ నాయకులు శివ, బాజ్జి,ప్రసాద్,శ్రీనివాసులు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు పాల్గొని విజయవతం చేయాలని, ఛలో విజయవాడ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని యుఈఈయు నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎస్‌పిడిసిఎల్ కమిటీ సమావేశం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సుబ్రమణ్యం రాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు ,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెకరేటరీ ముజఫర్ అహమద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9 వ తేదీన జరుగు దేశవ్యాప్త సమ్మెలో ప్రతి విద్యుత్ కార్మికుడు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఎస్‌పిడిసిఎల్ కమిటీ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, ప్రధాన కార్యదర్శి బొజ్జ సుమన్ మాట్లాడుతూ 2007 లో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను ఏవిధంగా రెగ్యులర్ చేశారో అదేవిధంగా ఇప్పుడు కూడా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. నెల్లూరు,కడప జిల్లాల అధ్యక్షులు గోగుల మహేష్,కే.శ్రీనివాసులు,తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ కుమార్,కమిటీ నాయకులు మహేంద్ర,మురళి, భాస్కర్,మనోహర్ రెడ్డి,కొండయ్య,జెన్ కో నాయకులు శేఖర్,భాస్కర్ ఉన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



పింఛన్లు అందజేస్తున్న కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పలుచోట్ల పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రతి పేదవాడికి కూడు గుడ్డతోపాటు నీడనివ్వడమే టిడిపి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముదివర్తిపాలెం గ్రామంలో ఆమె పర్యటించి గడపగడపకు తిరిగి పెన్షన్ పంపిణీ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సంవత్సరంలోపే నెరవేర్చారని తెలిపారు. రాష్ట్రంలో ఒకటో తేదీ పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఒక పండగ వాతావరణంగా జరుగుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోవూరు నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాల నుంచి పూడిక తీయని కాలువలను పూడికతీయించి రైతులకు ఉపయోగపడేలా చేయడం జరిగిందన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట బొగ్గు దిబ్బల వద్ద నివసిస్తున్న లెప్రసీ వ్యాధిగ్రస్తులకు మంగళవారం వారి నివాసం వద్ద మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పెన్షన్‌ను అందజేశారు. మండలంలో ఉన్న సమస్యలను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సహకారంతో అభివృద్ధి బాటలో నడుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, సచివాలయ సిబ్బంది రాము తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, చెంచు కిషోర్ బాబు, దేవి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సిగకొల్లు నాగరాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కావలి ఎడవల్లి గ్రామంలో మాజీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఏలూరి మాలాద్రి నాయుడు పింఛన్‌ను పంపిణీ చేశారు. అదేవిధంగా పొనుగోడు గ్రామపంచాయతీలో సాగునీటి సంఘం అధ్యక్షులు మలినేని వెంకటేశ్వర్లు నాయుడు సచివాలయ సిబ్బందితో కలిసి, పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సంగం : సంగంలోని తుంగా దయాకర్ రెడ్డి కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ పిసి మస్తానయ్య ఉద్యోగ విరమణ వేడుకలను విద్యుత్ శాఖ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ చౌదరి, పలువురు విద్యుత్ శాఖ అధికారులు, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు, గ్రామస్తులు ,కుటుంబ సభ్యులు పాల్గొని మస్తానయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. విద్యుత్ శాఖలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బుచ్చి సబ్ డివిజన్ ఎడి సతీష్, ఎఇ మన్మధరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, పలువురు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎఇకు సన్మానం



ప్రజాశక్తి-సంగం : సంగం ఇరిగేషన్ సెక్షన్‌లో లస్కర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసులుకు ఇరిగేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ ఎఇ విజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇరిగేషన్ డిఇ పెంచలయ్య, ఎఇలు, టిడిపి నాయకులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొని లస్కర్ శ్రీనివాసులు దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఇరిగేషన్ సెక్షన్‌లో లస్కర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పదవి విరమణ అనంతరం ఆయన జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఇ కృష్ణ, వెంగారెడ్డిపాలెం సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి, అన్నారెడ్డిపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, టిడిపి ఎస్‌సిసెల్ నాయకులు ఉక్కాల శ్రీనివాసులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతసాగరం



మండలంలోని ఉప్పలపాడు హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయునిగా పనిచేసి పదవి విరమణ చేసిన అబ్దుల్ కరీం దంపతులను యుటిఎఫ్ మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ 39 సంవత్సరాల క్రితం ఉపాధ్యాయ వృత్తిలో చేరినప్పటి నుండి సంఘంలో పని చేశారు. అంకిత భావంతో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తికి కొనసాగించారు. ఉద్యోగం నుండే తప్ప ఉపాధ్యాయ ఉద్యమం నుండి కాదని మండలంలో యుటిఎఫ్ ఉద్యమానికి సహాయ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సాదిక్, మండల సీనియర్ నాయకులు పాపిశెట్టి నరసింహులు, వలి అహ్మద్, కిష్టయ్య, రమణయ్య, తాజుద్దీన్, ఉపాధ్యాయ మిత్రులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గూడ్స్‌షెడ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో రైల్వే గూడ్స్ షెడ్ (సిఐటియు) యూనియన్ మహాసభలో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్ష కార్యదర్శులుగా మూలం ప్రసాద్, కె.వెంకటరత్నం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు చావా రామ్మోహన్, కోసూరి కేశవులు, డి.హరిబాబు, కె.వెంకటరత్నం,బి.మోహన్,పి.వేణు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్.గోపీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

'మాలేపాటి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట



బోగోలు మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను మంగళవారం టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు మధ్య కేకును కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఎన్నా బత్తిన వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లేళ్ల పల్లి సుధీర్ బాబు, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి లక్కాకుల మాధవరావు, మండల యువత అధ్యక్షులు అన్నంగి ఆదిశేషయ్య, మండల యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ పైడి హర్ష, పేరయ్య ,సీనయ్య, విజయ్ యాదవ్ లు పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావుకు పూలమాలవేసి శాలువా కప్పి సన్మానించారు.



విరమణ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ విరమణ పొందిన తుమ్మలూరి మస్తానయ్యను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు చేసిన ఉత్తమ సేవలను ఘనంగా కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు

కార్మిక సంఘాలు 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా ఈ సమ్మెకు సిపిఎం పూర్తి మద్దతు తెలిపిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం సిపిఎం ఆఫీసులో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభు త్వం 44కార్మిక చట్టాలను సవరించి 4లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని, దానివల్ల కార్మికులు చాలా ఇబ్బందులు పడే పరిస్థి తులు ఉన్నాయన్నారు. ముఖ్యంగా సమ్మె చేసేహక్కు, పోరాడే విధానం, ప్రశ్నించే పరిస్థితులు ఈ కోడ్‌ల వల్ల ఉండవన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని, ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని స్కీమ్ వర్కర్లకు అంగన్‌వాడీ, ఆశ, ఇతర రంగాల్లోనివర్కర్లకు ఉద్యోగులకు కనీస వేతనాలు లేవని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరిం చకుండా కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొస్తుందన్నారు. వ్యవసాయ రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ఉండడం లేదని ఉపాధి పనులకు తగిన బడ్జెట్ కేటాయించాలని, 200 రోజులు ఉపాధి పనికల్పించాలని, రోజు రూ.600 వేతనం ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటీకరణ ఆపాలని 9వ తేదీన కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు వ్యవసాయ కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్ర దం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, సీనియర్ నాయకులు ఎస్.వెంకయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, నాయకులు జి.మధుసుధన్ రావు, బాబు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలు తీరేనా..

ప్రజాశక్తి-మర్రిపాడు



శిథిలావస్థలో ఉన్న వసతిగృహం

పేద విద్యార్థులకు మెరుగైన వసతితో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసింది. మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకునేందుకు అవకాశం కల్పించింది. మండలంలో నాలుగు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో 6నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. మర్రిపాడు, కంపసముద్రం బాలుర వసతి గృహాలు శిథిలావస్థకు చేరి వర్షం వచ్చినప్పుడు ఉరుస్తూ, రాత్రి సమయంలో పడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. స్లాబ్ పెచ్చులు ఊడి పడుతూ ఏక్షణం ఏం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు వసతి గృహాలను పట్టించుకున్న పాపాన పోలేదు. బాలికల వసతి గృహంలో పడుకునే గదులకు, మరుగు దొడ్లకు తలుపులు, మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు మరింత పెరిగాయి. కంపసముద్రం హాస్టల్ చుట్టూ పిచ్చి చెట్లతో అడవిని తలపిస్తుంది. కొత్తగా విద్యార్థులు వసతి గృహంలో చేరాలన్న విద్యార్థుల తల్లిదండ్రులు భవనాలను చూసి భయాందోళన చెందుతున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్ వసతి, దోమల నివారణకు కిటికీలకు తెరలు ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని తూర్పు బోయమడుగుల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు వెంగయ్య బాలికలపై అసభ్యంగా ప్రవర్తించాడని గ్రామస్తులు, విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడిపై దాడి చేసి దేహశుద్ధి చేశారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే ఇలా అసభ్యంగా ప్రవర్తించడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా వెంగయ్య విద్యార్థినులపై ఇదే విధంగా ప్రవర్తించేవాడని స్థానికులు ఆరోపించారు. గతంలో ఉదయగిరి మండలంలో కూడా ఇదే తరహా చేశారని, ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గ్రామస్తుల దాడితో ఉపాధ్యాయుడు వెంగయ్య పాఠశాల గోడ దూకి పరారయ్యాడు. ఆగ్రహించిన గ్రామస్తులు అతని కారును కూడా పూర్తిగా ధ్వంసం చేశారు. ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినుల తల్లిదండ్రులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎఐఐఇఎ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

బీమా ప్రీమియంపై జిఎస్‌టి రద్దు చేయాలని ఎస్‌బిఎం సిహెచ్ మెహర్ కుమార్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో ఎఐఐఇఎ (ఎల్ఐసి) 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు బీమా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.రమేష్ పతాకావిష్కరణ చేశారు. బ్రాంచ్ కార్యదర్శి శ్యామ్ ప్రభాకర్ మాట్లాడుతూ సంస్థను కంటికి కనురెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉన్నదని తెలియజేశారు. అలాగే పాలసీదారుల సర్వీసులో మరింత మెరుగైన సేవలు అందించాలని తెలియజేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు జీవి శివ ప్రసాద్ మాట్లాడుతూ మనం చేసే పోరాటాల ఫలితంగానే ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలోనే కాపాడుకుంటూ వస్తున్నామని తెలియజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా చేయడం సరికాదని వాటిని వెంటనే రద్దు చేయాలని 9న జరగబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లాస్-1 అధికారులు, క్లాస్-2 అధికారులు, యూనియన్ ఆఫీస్ బ్యారర్స్ సాయితేజ, జాయింట్ సెక్రెటరీ ఎం.రమాదేవి, నందగోపాల్, ఏజెంట్ మిత్రులు పాలసీదారులు అందరిని కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.మెహర్ కుమార్, బ్రాంచ్ కార్యదర్శి శ్యామ్ ప్రభాకర్, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'తొలి అడుగును' విజయవంతం చేద్దాం..

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కావలి పట్టణ టిడిపి శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని తెలియపరుస్తూ ఇంటింటికి వెళ్దామని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే అభిప్రాయాలను సేకరిస్తూ "మై టిడిపి యాప్"లో పొందుపరచాలని తెలిపారు. బూత్ లెవెల్‌లోని కార్యకర్తలు, ఇన్‌ఛార్జులు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు వారికి సహకారం అందించాలని తెలిపారు. జూలై 2వ తేదీ బుధవారం కావలి పట్టణంలోని 15వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నానని, డోర్ టు డోర్ తిరిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య, పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

నేడు రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కావలి



కావలి కాపుల చిరకాల కోరిక వంగవీటి మోహన రంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఎం.ఎల్.ఎ. దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సారథ్యంలో బుధవారం సాయంత్రం 4గంటలకు నిర్వహించడం జరుగుతుందని రంగా విగ్రహ ఆవిష్కరణ కమిటీ కన్వీనర్ దేవరకొండ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మాగుంట పార్వతమ్మ ట్రంక్ రోడ్డులో రైతు బజార్ సెంటర్‌లో కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహం ఆవిష్కరించేందుకు రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి, వంగవీటి మోహన రంగా తనయుడు, విజయవాడ మాజీ ఎంఎల్ఎ, వంగవీటి రాధాకృష్ణ, అతిరథ, మహారథులైన నాయకులు పాల్గొంటారని తెలిపారు. కమిటీ సభ్యులు పసుపులేటి బాబురావు, ఆలా శ్రీను పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించండి..

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



మరుగున పడ్డ వాటర్ ప్లాంట్

ఎఎస్‌పేట పంచాయతీ పరిధిలోని గండువారిపల్లి శివారు ప్రాంతంలో మండలంలోని 19 పంచాయతీలకు నీటిని సరఫరా చేయడం కోసం ఏర్పాటు చేసిన మదర్ వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైయస్సార్ సుజల స్రవంతి అనే పేరుతో కేవలం రూ.5లకే కార్డు ద్వారా, నీటిని మండలంలోని అన్ని గ్రామాలకు గండువారిపల్లిలోని, మదర్ వాటర్ ప్లాంట్ ద్వారా నీటిని ట్రాక్టర్ల ద్వారా, ప్రతి గ్రామానికి అక్కడ ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్‌కు నీటిని నింపి అక్కడ నుంచి ప్రజలందరికీ అందజేసేవారని తెలిపారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్టర్లు సకాలంలో కరెంటు బిల్లులు చెల్లించలేదని విద్యుత్ అధికారులు వారికి విద్యుత్ నిలుపుదల చేయడంతో, వివిధ కారణాలతో మదర్ వాటర్‌ప్లాంట్ మరుగున పడిపోయిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు గ్రామాల్లోని ప్రజలు ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన, వాటర్ ప్లాంట్ల ద్వారా 20 లీటర్ల ఒక కాను రూ.15 పెట్టి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నలుగురున్న కుటుంబ సభ్యులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన నీటిని ఈ విధంగా రూ.15 చెల్లించి తీసుకోవాలంటే చాలా కష్టంగా మారుతుందని వాపోయారు. కావున ఈ విషయాన్ని గమనించి నూతనంగా ఏర్పడిన, ఏడాది పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి, ప్రజల పడుతున్న ఇబ్బందులను పెడచెవిని పెట్టకుండా, త్వరితగతిన వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తేవాలని, అంతేకాకుండా లక్షల రూపాయల ఖర్చులతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు, మదర్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ప్రజాధనం వృథా కాకుండా చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి-సంగం :



మండలంలోని తరుణవాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 -25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.5000, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.3000, తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.2000 లెక్కన మన మిత్రులు, తరుణవాయి స్వగ్రామస్తులు, బుచ్చిరెడ్డిపాలెం మండలం పంచేడు స్కూల్ టీచర్ అయిన చెల్లా ప్రభాకర్ యాదవ్ తండ్రి చల్లా పెంచలయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు అందజేశారు.

డాక్టర్లకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కావలి డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం కావలిలో ఉన్న ప్రభుత్వ వైద్యులు జి.ప్రమీల కుమారి కంటి వైద్యురాలు, సి.విజయ భాస్కరరావు ప్రముఖ చెవి, ముక్కు, గొంతు నిపుణులను న్యాయవాది ఇసకల సాయిరాం, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండా రెడ్డి కలసి, పుష్పగుచ్ఛంలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించి ప్రజల ఆరోగ్యాలని కాపాడాలని కోరారు.

ప్రజా సేవకుడు జి వి శివప్రసాద్

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్



జివి శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అవినీతి మరకలేని మహోన్నత వ్యక్తి ఎవరు ఏ సమస్యపై వచ్చిన కాదనకుండా తన శక్తి సహాయం చేసే వ్యక్తిత్వం కలిగిన ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకుడు జి వి శివప్రసాద్ అని పలువురు కొనియాడారు. సోమవారం రాత్రి సభాధ్యక్షులుగా కొండమూరి హజరత్తయ్య వ్యవహరించారు. ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమం విద్యుత్ శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఉద్యోగులు, కార్మికులు, అభిమానులు నడుమ అంగరంగ వైభవంగా పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 35 సంవత్సరాలు విద్యుత్ సంస్థలో ఉద్యోగ సేవలు అందించి యుఇఐయు - సిఐటియు జిల్లా రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా రాజీలేని అలుపెరగని కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు.

అలాగే స్థానిక మంత్రికి సమస్యలను వివరించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఆయన విద్యార్థి దశ నుండి కేవలం విద్యార్థుల సమస్యలే కాకుండా సమాజంలో ఉండే అనేక సమస్యల పట్ల అవగాహన ఉందన్నారు. అందులో భాగంగానే ఆయన అనేకమందిని నాయకులుగా, కార్యకర్తలుగా తయారు చేయడం జరిగిందన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అంశాల నుండి అంతర్జాతీయ అంశాలు దాకా ప్రతి విషయంపై ఆయనకు అవగాహన ఉంటుందని తెలిపారు. ఆయన సిఐటియు, కార్మిక సంఘాలకు నాయకుడు కాకుండా అనేక మేధావుల సంఘాలు జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్, అనేక ప్రజా చైతన్య వేదికలను వాటన్నిటిలో మమేకమై అటువంటి వాటిలో పాల్గొని వారిని చైతన్యపరిచి అనేక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొని వారిని చైతన్యపరిచి ఉద్యమాలను నడిపించే వ్యక్తి శివయ్య అని పలువురు కొనియాడారు. అనంతరం శివయ్య దంపతులను పూలమాలలతో శాలువాలతో అధికారులు రాజకీయ నాయకులు, ఉద్యోగులు ఉద్యోగ సంఘాలు, అభిమానులు పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్మికుల పక్షాన నిలబడి వారికి అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాను నాయక్, డిప్యూటీ ఇంజనీరు ఎగ్జిక్యూట్ ఇంజనీర్ చిన్నస్వామి నాయక్, యుఇఐయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రావు, రాష్ట్ర ప్రధాన గ్యారర్ నాయబ్ రసూల్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు, తుమ్మల చంద్రారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐవి రమణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చల్లా రవికుమార్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, జిల్లా కౌలు రైతుసంఘం ఉపాధ్యక్షుడు గంటా లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్కు కష్ణ ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు గంగాధర్, శివయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాధమ్మ, సిపిఎం నాయకులు హజరత్తయ్య, ఎం.నాగేంద్ర, నంద శీను, ఐద్వా నాయకురాలు గుల్జారి బేగం, పద్మమ్మ, పలువురు అభిమానులు పాల్గొని జయప్రదం చేశారు.

ఖాదర్ బాషా ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు కావలిలో మంగళవారం సమావేశమై, తమకు అత్యంత సన్నిహితులు, సామాజిక సేవాతత్ప రులు, మాశ్రేయోభిలాషులు, విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి, షేక్.ఖాదర్ బాషాను, ఇష్టపూర్వకంగా, మా స్వచ్ఛంద సంస్థలకు, సంతోషంగా, గౌరవాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అందరికి తెలియపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ ముస్లిం మైనారిటీ, మొఘల్ సలీం బేగ్,మీకోసం సేవా సంస్థ రాయపాటి దిలీప్ కుమార్, సంయుక్త సేవా సంస్థ జి.సురేంద్ర, హ్యాపీ సేవా సంస్థ సయ్యద్ ఘని బాషా, రత్నమ్మ ఫౌండేషన్, ఎంవి ప్రసాద్ రావు, జాగో సేవా సంస్థ సయ్యద్ జమీర్, ఆపద్బాంధవ సేవా ట్రస్ట్, దామ మధుసూదన్ రావు,సాయి చారిటబుల్ ట్రస్ట్ పొన్నగంటి మాధవి, ఎంపీజే రఫీ అహమ్మద్, టైం టు హెల్ప్ ఎన్.రమేష్, లోక్‌సత్తా, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, దివ్యాంగుల సేవా సంస్థ టీసీ మాల్యాద్రి నాయుడు, విజయభారత్ చారిటబుల్ ట్రస్ట్ కిరణ్‌కుమార్, విశ్రాంత లైబ్రేరియన్, ప్రభాకర్, సామాజిక కార్యకర్తలు, శారద, పీఎంపీ నాగరాజు,తదితరులు సమాఖీభావం తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, NELLORE.

G.O.P. No.378/2025

(In the matter of Guardianship of Shaik Mohammad Farid aged 8 years and Shaik Purzad aged 6 years).

In the matter of the Estate of minors

1. **Shaik Mohammad Farid,** S/o **Shaik Arif Basha,** Aged 8 years, represented by father Shaik Arif Basha, S/o Mastan Basha age 33 years, Business, Muslim, residing at 1-90, Mahendra Service Centre, Trunk road, Musunur, Kavali, SPSR Nellore District.
2. **Shaik Purzad,** S/o **Shaik Arif Basha,** aged 6 years, represented by Grandfather **Shaik Mastan Basha,** S/o late **Adam Saheb,** age 55 years, Business, Muslim, residing at 1-90, Mahendra Service Centre, Trunk road, Musunur, Kavali, SPSR Nellore District ...Petitioners

Vs.

NIL ... Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున 1, 2 పిటిషనర్లు అయిన షేక్.మహమ్మద్ ఫరీద్, షేక్.పుర్జాద్ మైనర్లు అయినందున మైనర్లకు హక్కు అనుభవం కలిగిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని మైనర్లు తరపున ఇతరులకు లీజుకు ఇచ్చి వచ్చిన మొత్తములను మైనర్లు పేరిట కోర్టువారు నిర్ణయించిన ఏదైనా జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయుటకు అనుమతి కోరుతూ పై తెలిపిన కోర్టులో G.O.P.No.378/2025 ను దాఖలు చేసియున్నందున, సదరు పిటిషన్‌పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల **తే15-07-2025దిన ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

PETITION SCHEDULE

SPSR Nellore District – Nellore Registration District – Kavali Sub registration – Kavali Municipality – Musunur Village – Adjacent National High way – S/y No.553-4B2 total extent of 0.43 cents, out of this 0.05.11 cents or 30 Ankanams and S/y No.552-1A2 total extent 0.35 cents – S/y 552-2A1 total extent Ac.0.70 cents – s/y No.556-3B total extent Ac.3.63 cents out of this Ac.1.81 cents total extent is this petitioners having Ac.2.911 cents or 11780.3990 sq.mtrs out of this leased an extent of 1800 sq.mtrs or 44.48 cents or 269.58 Ankanams Vacant site with following boundaries; **East :** Remaining own land, **South :** Remaining own land, **West :** NH 5 Road, **North :** Remaining own land.

Total value of the property : Rs. 1,53,33,120/-.
Yearly lease Value : Rs. 8,40,000/-.
Each petitioner having ½ of share.

వేమన గోపి, బి.కాం., ఎల్.ఎల్.బి.,
పిటిషనర్లు తరపు అడ్వకేట్, నెల్లూరు.

Before The VI Addl. Motor Accidents Claims Tribunal : Nellore.

M.V.O.P.No. 309 / 2024

Koppula Suseela - Claimant

Versus

1. Kantipalli Sujatha and 8 others - Respondents

Notice

To,
R8. Mannam Amaravathi, W/o **Babu,**
R9. Mannam Babu, S/o **Raghavaiah,**
The Respondents 8 & 9 both are R/o. Kothuru, Nellore City (Parents of the Deceased person Mannam Pushpa, W/o Koppula Prasanth)

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారములు కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే31-07-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

టి.వి.కళ్యాణ్ కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the III Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 351 / 2023

Shaik Pyarijhan - Plaintiff

Vs

Potladurthi Nageswara Rao - Defendant

Notice to Defendant

Potladurthi Nageswara Rao,
S/o **Potladurthi Subba Ramaiah,**
residing at Veeranna Kanupuru Village, Venkatachalam Mandalam, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే31-07-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామా ధమరేశ్వర్, బి.ఎ., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.